క్లుప్తంగా

వివేక్ వెంకటస్వామి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న స్థానికులు

భీమారం: మండల కేంద్రంలోని ఇప్పలబొగుడ ప్రాంతంలో స్థానికులు శుక్రవారం రాష్ట్రమంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 1వ వార్డులో అన్ని వీధులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు 50 స్తంభాలు ఏర్పాటుచేసి లైన్ ఏర్పాటు చేయించిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేశ్, బూనేని సుదాకర్, తోట శ్రీరాములు, ఆవిడపు శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



కిష్టంపేటలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

చెన్నూర్‌రూరల్: కలెక్టర్, డీఏవో ఆదేశాలతో చెన్నూర్‌తోపాటు మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ఫర్టిలైజర్ షాపులను ఏడీఏ పిపి గోపి శుక్రవారం తనిఖీ చేశారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి సెప్టెంబర్ మూడవ వారం వరకు జరిగిన ఎరువుల విక్రయాల గురించి, రైతుల వివరాలు, బిల్ బుక్‌లు, స్టాక్ రిజిస్టర్లు, పీఓఎస్ మిషన్లను తనిఖీ చేశారు. ఏడీఏలు బానోతు ప్రసాద్, కృష్ణ, రజిత, వ్యవసాయాధికారులు యామిని, ప్రభాకర్ ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో కేబినెట్ ఎన్నికలు



పరిశీలిస్తున్న ఎంఈవో వెంకటేశ్వరస్వామి

కాసిపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు కేబినెట్ ఎన్నికలు నిర్వహించారు. హెడ్ బాయ్‌గా కార్తీక్, హెడ్ గర్ల్‌గా చంద్రహస్య ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ ఖలీల్ తెలిపారు. విద్యార్థులకు ఓటుహక్కు ప్రాధాన్యత, ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. ఎంఈవో వెంకటేశ్వరస్వామి ఎన్నికల తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపిక

కాసిపేట: మండలంలోని మోడల్ స్కూల్ ఇంటర్మీడియెట్ విద్యార్థినులు ఎ.అనూష, బి.శిరీష రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మందమర్రి మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన అండర్-19 కబడ్డీ పోటీల్లో అనూష, ఈనెల 18న ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ఆసిఫాబాద్‌లో నిర్వహించిన అండర్-19 విభాగం ఖోఖో పోటీల్లో శిరీష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

తాండూర్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అచ్చలాపూర్‌లోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి రాజ్‌కుమార్ ఎంపికైనట్లు పీడీ సాంబమూర్తి తెలిపారు. నస్పూర్‌లో జరిగిన సాధన స్పోర్ట్స్ అకాడమీ 35వ సబ్ జూనియర్ కబడ్డీ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో పదో తరగతి విద్యార్థి రాజ్‌కుమార్ ప్రతిభకనబర్చి ఈనెల 25 నుంచి 28 వరకు నిమాజాబాద్ జిల్లా ముష్కల్ గ్రామంలో నిర్వహించే రాష్ట్రపోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. హెచ్ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు, ఏఏపీసీ చైర్మన్ చిలుకమ్మ అతన్ని అభినందించారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు

లక్సెట్టిపేట: నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ సమ్మయ్య శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు లక్సెట్టిపేట ఎక్సైజ్ పరిధిలో 152 ఐడీ కేసులు నమోదు చేసి 145మందిపై చర్యలు తీసుకున్నామని, 111 మందిని స్థానిక తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు. నలుగురు బైండోవర్ ఉల్లంఘన కేసులు, రూ.1.70 లక్షల జరిమానా, మూడు నెలల జైలు, నాటుసారా రవాణా చేస్తున్న 8 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు

బెల్లంపల్లి: సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు వెళ్తున్న పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శుక్రవారం తెల్లవారుజామున బెల్లంపల్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేసి టూటౌన్‌కు తరలించారు. బెల్లంపల్లి, వేమనపల్లి, భీమిని మండలాలకు చెందిన సంఘ బాధ్యులు భానుమతి, అనురాధ, శంకరమ్మ, మహేశ్వరి, విజయలక్ష్మి, మానస, కళావతి తదితరులు ఉన్నారు. వీరి అరెస్టులను సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది.

ఓబీ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

- మూడు నెలలుగా వేతనాలు బంద్
- పనులు నిలిపివేత.. ఉత్పత్తిపైనా తీవ్ర ప్రభావం



వేతనాల కోసం అధికారులతో వాగ్వాదం చేస్తున్న ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ పనులు నిర్వహించే కాంట్రాక్టు సంస్థ కాంట్రాక్టు కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోంది. గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. సంస్థలో పని చేస్తున్న సుమారు 600మంది కాంట్రాక్టు కార్మికులు ఆందోళన బాట పట్టారు. శుక్రవారం ఓసీపీలో బొగ్గు రవాణాను అడ్డుకున్నారు. క్వారీ నుంచి వచ్చే బొగ్గు డంపర్లను ఆపి నిరసనకు దిగారు. పలుమార్లు వేతనాలు చెల్లించాలని ఓబీ క్యాంపు, జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించినా అధికారులు పట్టించుకోకపోవడంతో చివరికి బొగ్గు ఉత్పత్తిని అడ్డుకున్నారు. దీంతో ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, ఓసీపీ పీవో చిప్ప వెంకటేశ్వర్లుతో కార్మికులతో చర్చించినా వినలేదు. పండుగ సమీపిస్తున్న తరుణంలో మూడు నెలల వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతికేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు.

27 నుంచి పనులు బంద్

సదరు కాంట్రాక్టర్ ఓబీ పనులు కూడా సక్రమంగా చేయడం లేదు. గత నెల 27నుంచి పనులు పూర్తిగా బంద్ చేశారు. సంస్థ ముఖ్య ప్రతినిధులు ఎవరూ అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఒక్క యంత్రాన్ని నడపడం లేదు. దీంతో ఓబీ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీని ప్రభావం బొగ్గు ఉత్పత్తిపై పడింది. ఓబీ తీస్తేనే కింద ఉన్న బొగ్గు తీయడానికి వీలవుతుంది. ఉత్పత్తి నిలిచిపోవడంతో కంపెనీ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, సదరు కాంట్రాక్ట్ సంస్థ నాలుగేళ్ల కాంట్రాక్ట్ పని కాలానికి 740 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తీయాల్సి ఉంది. ఇంకా 15 నెలల టెండర్ కాలం మిగిలి ఉంది. ఇప్పటికే అందులో 50శాతం మాత్రమే లక్ష్యాన్ని సాధించారు. దీంతో తీవ్ర ఉత్పత్తి విఘాతం ఏర్పడింది. ఈ సంస్థ పనితీరు ఆది నుంచి అధ్వానంగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. పలుమార్లు హెచ్చరించి అపరాధ రుసుం వేసినా మొండిగా వ్యవహరిస్తున్నారు.

ఈపీఎఫ్ రికవరీ కూడా జేబుల్లోనే..

కాంట్రాక్టర్ కార్మికుల ఈపీఎఫ్ డబ్బులు కూడా కట్టడం లేదు. ప్రతీ కార్మికుని వేతనం నుంచి 12శాతం తన వాటాగా ఈపీఎఫ్ కింద కట్ చేసి అంతే మొత్తం 2 శాతం కాంట్రాక్టర్ కలిపి వారి ఈపీఎఫ్ కట్టాలి. సదరు కాంట్రాక్టర్ జూన్, జూలై, ఆగస్టు నెలలో ఈ డబ్బులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్ట్ కార్మికుల నుంచి రికవరీ అయిన సుమారు రూ.21 లక్షలు కాంట్రాక్టర్ వద్దే ఆగి ఉన్నాయి. దీనిపై కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాల కోసం ఒత్తిడి తెస్తున్నాం

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లించాలని గత రెండు నెలల నుంచి ఓబీ కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం. రేపు మాపు చెల్లిస్తానంటూ దాటు వేస్తున్నారు. ఓబీ పని తీరు కూడా సరిగ్గా లేదు. చివరికి గత నెల 27 నుంచి ఓబీ పనులు నిలిపివేశారు. ఉన్నత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం.

– చిప్ప వెంకటేశ్వర్లు, ఓసీపీ పీఓ

డంప్‌యార్డుతో అవస్థలు

- మంచిర్యాలలోని చెత్త నస్పూర్‌కు
- దుర్వాసనతో ఇబ్బందులు
- కాలనీల ప్రజల ఇక్కట్లు

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో

చెత్త	మెట్రిక్ టన్నుల్లో
తడి	9.38
పొడి	17.4
మిక్స్‌డ్	40.23



నస్పూర్‌లో డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

నస్పూర్: పట్టణ పరిధిలోని ఆర్కే 5 కాలనీ సమీపంలోని డంప్‌యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో పలు కాలనీ ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నస్పూర్, మంచిర్యాల, హాజీపూర్ మండలాల్లోని పలు గ్రామాలను కలిపి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. జిల్లాకేంద్రంలోని ఆండాలమ్మ కాలనీ, నస్పూర్‌లోని ఆర్కే 5 కాలనీ వద్ద రెండు డంప్‌యార్డులు ఉన్నాయి. నస్పూర్ మున్సిపల్ పరిధిలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేవారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో నస్పూర్ కలవడంతో మంచిర్యాలలో సేకరించిన చెత్తను ఆండాలమ్మ కాలనీలోని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు స్థలం సరిపోవడం లేదు. దీంతో నస్పూర్‌కు తరలిస్తుండడం, రోజుల తరబడి చెత్త పేరుకుపోయి కంపు రావడంతో సింగరేణి కార్మికుల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతోంది. వృద్ధులు, చిన్నారులు శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నారు.

సింగరేణి స్థలంలో ఏర్పాటు

సీసీసీ ఆర్కే 5 కాలనీ సమీపంలో సింగరేణి సంస్థకు చెందిన సుమారు పదెకరాల స్థలంలో డంప్‌యార్డు ఏర్పాటు చేశారు. ప్రతీరోజూ సేకరించిన చెత్తను డంప్ చేస్తున్నారు. అందులో నుంచి వచ్చే దుర్వాసనతో ఆర్కే 5, సీసీసీ టౌన్‌షిప్, నాగార్జున, న్యూనాగార్జున, షిర్కే, తాళ్లపల్లి, సింగాపూర్ ఆర్ అండ్‌ఆర్ కాలనీలు, సుందరయ్య కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. డంపింగ్ యార్డు సమీపంలో ముక్కిడి పోచమ్మ పోలేరమ్మ ఆలయాలు, చర్చిలకు వచ్చే వారు, ఆర్కే 5 కాలనీలో వృద్ధాశ్రమంలోని వృద్ధులు, సీసీసీ సింగరేణి పాఠశాల విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

రోజు 67 మెట్రిక్ టన్నుల చెత్త

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతీరోజు 67 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. సేకరణకు 83 స్వచ్ఛ ఆటో ట్రాలీలు, 25 ట్రాక్టర్లు, వినియోగిస్తారు. ప్రతీరోజు సుమారు 55 నుంచి 60 స్వచ్ఛ ఆటో ట్రాలీలు ట్రిప్పుల చెత్తను తరలిస్తుండడం గమనార్హం. దీనికి తోడు ట్రాక్టర్ల ద్వారా తరలించే చెత్త అదనం.

వేరేచోటకు తరలించాలి



ముక్కిడి పోచమ్మ ఆలయ సమీపంలో డంప్‌యార్డు ఉండడం వల్ల దుర్వాసనతో భక్తులకు ఇబ్బందిగా మారింది. డంప్‌యార్డును మరో చోటకి తరలించాలి. ఈ సమస్యను పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. – సాతూరి రమేశ్, పూజారి

మెడికల్ వేస్ట్ తరలిస్తే చర్యలు



ఆండాలమ్మ కాలనీ డంప్‌యార్డులో స్థలం సరిపోక కొంత సేకరించిన చెత్తను నస్పూర్‌కు తరలిస్తున్నాం. మొత్తం రెండు డంపింగ్ యార్డుల్లో మెడికల్ వేస్టని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– సంపత్‌కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

తీరనున్న కష్టాలు

- ఎట్టకేలకు భీమారం పీహెచ్‌సీ భవనం పూర్తి
- రూ.1.43 కోట్లతో నిర్మాణం
- త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు
- అందుబాటులోకి వైద్యసేవలు



భీమారంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనం

భీమారం: దశాబ్దకాలం నుంచి మండల ప్రజలు ఎదురుచూస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం ఎట్టకేలకు పూర్తయింది. మండల కేంద్రంలోని 138 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో 15వ ఫైనాన్స్ నిధులు రూ.1.43 కోట్లతో గత సంవత్సరంలో చేపట్టిన పీహెచ్‌సీ భవనం పనులు పూర్తయింది. దీంతో మండల ప్రజలకు వైద్యకష్టాలు తీరనున్నాయి. రాష్ట్ర మంత్రి, ఎంపీలతో త్వరలో భవనం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడ్డ అనంతరం అప్పటి ప్రభుత్వం 2016లో కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసింది. ఆ సమయంలో భీమారంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తుందని ప్రజలు ఆశపడ్డారు. గతప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో మండలంలోని 11 పంచాయతీల ప్రజలు జైపూర్, మంచిర్యాలకు వెళ్లి వైద్యం పొందేవారు. మండలంలో చివరి గ్రామంగా ధర్మారం ప్రజలు వైద్యసేవల కోసం ఆటోలో 15 కి.మీ దూరాన భీమారం వచ్చి అక్కడ నుంచి మరో 10 కి.మీ దూరాన జైపూర్ పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స తీసుకునేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భీమారంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల నాయకులు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు.

స్థలం లేకనే ఆలస్యం

మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న భీమారంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఇప్పటివరకు సొంత భవనాలు నిర్మించలేదు. మొదటిది పోలీస్‌స్టేషన్ కాగా, రెండవది పీహెచ్‌సీ భవనం ఉంది. పీహెచ్‌సీ కోసం సరైన స్థలం లేకనే ఆలస్యం జరిగింది. గత సంవత్సరం రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించడంతో పనులు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ కుమార్‌దీపక్ నెలలో రెండుసార్లు పనులను పరిశీలించారు. సత్వరం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. 11 నెలల్లోపు కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు.

సంతోషంగా ఉంది



పీహెచ్‌సీ భవన పనులు పూర్తికావడం సంతోషంగా ఉంది. ఇప్పుడు పూర్తయి వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

– దుర్గం రాజు, భీమారం

అందుబాటులోకి తెస్తున్నాం



భీమారం పీహెచ్‌సీ భవనం పూర్తిచేసి అందుబాటులోకి తెస్తున్నాం. మండల ప్రజలకు వైద్యసేవలు త్వరలో అందనున్నాయి. ఏడాదిలోపు భవన పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయనున్నాం.

– వివేక్‌వెంకటస్వామి రాష్ట్రమంత్రి

మంత్రిని కలిసి.. గోడు వెళ్లబోసుకుని



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

దండేపల్లి: మండలంలోని కొత్తమామిడిపల్లి పంచాయతీ పరిధిలోని దమ్మన్నపేటకు చెందిన ఆదివాసీ నాయకపోడ్ గిరిజనులు రాష్ట్రమంత్రి సీతక్కను హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. గత కొన్నేళ్లుగా లింగాపూర్ అటవీ బీట్‌లో కొంతభూమిని ఆక్రమించుకుని, అందులో పంట సాగుచేసుకుంటే అటవీ అధికారులు ధ్వంసం చేయడంతో పాటు, తమపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఆ భూములకు హక్కు పత్రాలిచ్చి, తమపై కేసులు ఎత్తివేయాలని కోరారు. ఈమేరకు రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందించారు. స్పందించిన మంత్రి..కలెక్టర్, అటవీశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి, వాస్తవ పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు

పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మిద్దాం

- కలెక్టర్ కుమార్ దీపక్



పోషణమాసం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: సరైన పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మిద్దామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావుతో కలిసి పోషణమాసం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 16 వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణమాసం కార్యక్రమాన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. అనంతరం పోషణమాసం సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించి పోషణ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి సుధాకర్, సీడీపీవో విజయ, రజిత, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త సౌజన్య, జిల్లా ప్రాజెక్టు సహాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

మందమర్రిరూరల్: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి తహసీల్దార్ సతీశ్‌కుమార్‌తో కలిసి పలు రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనంతరం కస్తూరిబా హైస్కూల్‌ను సందర్శించి వంటశాల, రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వెంకటాపూర్ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసే విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన చేశారు. అనంతరం నర్సరీని సందర్శించి సూచనలు చేశారు. అధికారులు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

కోదండరాంతో నేతల భేటీ



కోదండరాంతో సింగరేణి ఉద్యోగుల సంఘం నేతలు

శ్రీరాంపూర్: టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాంను సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి తదితరులు భేటీ అయి సింగరేణి సమస్యలపై చర్చించారు. సమస్యల సాధనకు జరిగే పోరాటంలో అండగా ఉంటానని కోదండరాం తమకు హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, కార్యదర్శి సమ్ము రాజయ్య పాల్గొన్నారు.

సెక్యూరిటీ అధికారికి వినతి

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ డివిజన్‌లో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డికి వినతిపత్రం అందజేశారు. శాఖ కార్యాలయంలో కలిసి విన్నవించారు. డి.బ్రహ్మానందం, శంకరి, సత్యం, సదానందం పాల్గొన్నారు.

లాభాల వాటా ప్రకటించాలి

మందమర్రిరూరల్: గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి 35 శాతం పంపిణీ చేయాలని కోరుతూ ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్వోటూ జీఎం విజయప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ప్రారంభించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు.. ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రిన్సిపాల్ శంకర్, నాయకులు మైదం రమేష్, గోలేటి స్వామి, రాజమౌళి, ఆనంద్, మనోహర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు

నస్పూర్: పట్టణ పరిధిలోని సింగరేణి రిటైర్మెంట్ కాలనీలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో దుర్గాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉచిత కుట్టుమిషన్ శిక్షణ శిబిరంలో మహిళలు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని దుర్గా దేవికి పూజలు చేశారు.

బతుకమ్మ సంబురాలు



మంచిర్యాల కేజీబీవీలో..



శిశుమందిర్ పాఠశాలలో..

మంచిర్యాలఅర్బన్/లక్సెట్టిపేట: మంచిర్యాల కేజీబీవీ, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, లక్సెట్టిపేటలోని శ్రీ సరస్వతి శిశుమందిర్, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. బాలికలు, బోధకులు రంగు,రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆడిపాడారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ అనూష, కల్చరల్ కోఆర్డినేటర్ సరిత, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్లు రజిత, ప్రభావతి, కలం స్నేహం అనుబంధ సంస్థలు శ్రీమాన్ గోపాల్, రమాదేవి, చింత అశోక్, హెచ్‌డబ్ల్యూవో రేవతి, హెచ్ఎం సత్యనారాయణ, పీడీ జీవరత్నం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

పాతమంచిర్యాల: చెన్నూర్ మండల సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బొడెంకి చందును జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు శుక్రవారం సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, వాడబలిజ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్, బీసీ నాయకులు అంజయ్య, రాజన్న ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

లక్సెట్టిపేట: పాత బస్టాండ్ ఆవరణలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శుక్రవారం సీజనల్ వ్యాధులు, ప్రభుత్వ పథకాలపై కళాజాత నిర్వహించారు. ఆటపాటరూపంలో అవగాహన కల్పించారు.

జన్నారం: జిల్లా వైద్యాధికారి ఆదేశాలతో జన్నారం బస్టాండ్‌లో హెచ్ఐవీపై కళాజాత నిర్వహించారు. హెచ్ఐవీ ఎలా సోకుతుంది. ఎలా నివారించాలనే వివరాలను పాటల రూపంలో వివరించారు. దిశ కోఆర్డినేటర్ నీలిమా ఉన్నారు.

క్షయపై అవగాహన

లక్సెట్టిపేట: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో జెండావెంకటాపూర్‌లో వెంకట్రావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి సతీష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు ఉన్నారు.

కళాశాలలో బాలసభ

చెన్నూర్: ప్రణాళికబద్ధంగా చదివితే విజయం సాధించవచ్చునని పూర్వ విద్యార్థిని ఆకుల రాజేశ్వరి అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ కళాశాలలో బాలసభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాజేశ్వ హాజరయ్యారు. ఇటీవల నిర్వహించిన పీజీసెట్‌లో రాజేశ్వరి రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించింది. కళాశాల ప్రత్యేకాధికారిణి సుమలత ఆమెను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

సాహితీ పురస్కారానికి ఎంపిక

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు తుమ్మల దేవరావ్ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సాహితీ కిరీటి పురస్కారానికి ఎంపికయ్యాడు. సాహితీ రంగంలో ఆయన చేస్తున్న కృషికిగాను ఈనెల 28న హైదరాబాద్‌లోని జిల్లా ఆడిటోరియంలో ప్రముఖ సాహితీవేత్తలు ఈ పురస్కారం అందజేయనున్నారు.

108 పైలట్, ఈఎంటీకి సన్మానం

చెన్నూర్‌రూరల్/చెన్నూర్: ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా బీజేపీ నాయకులు శుక్రవారం కోటపల్లి పీహెచ్‌సీలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్.. 108 అత్యవసర సేవలను అడిగి తెలుసుకున్నారు. 108 అత్యవసర సేవలు అందిస్తున్న పైలట్ ఫరీద్, ఈఎంటీ శహబాజ్‌లను సత్కరించి, అభినందించారు.

దళితుల మనోభావాలు దెబ్బతీయొద్దు

బెల్లంపల్లి: రావణాసుర వధ నిర్వహించి దళితుల మనోభావాలు దెబ్బతీయొద్దని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దసరా వేడుకల్లో భాగంగా రావణాసుర వధను అడ్డుకోవాలని ఐక్యవేదిక నిర్ణయం తీసుకుందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ బలపర్చిన హిందు ఉత్సవ కమిటీకి సహకరించొద్దన్నారు. రాజేష్, చిలుక రాజనర్సు, గోమాస రాజం, రత్నం ఐలయ్య, దుర్గం గోపాల్, రాజలింగు, శేఖర్, రాజలింగు పాల్గొన్నారు.

ఒర్రెపై కల్వర్టు నిర్మించాలి

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ సంఘం మల్లయ్యపల్లె వద్ద గల ఒర్రెపై కల్వర్టు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఒర్రె వద్ద సీపీఎం నాయకులు స్థానికులతో కలిసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రాజ్‌కుమార్, మహేశ్, షాబుద్దీన్, భూమయ్య, అనిత, శ్రీనివాస్, విజయ్‌కుమార్, జ్యోతి, అంజి, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలందరికీ వైద్యపరీక్షలు

మంచిర్యాలటౌన్: స్వస్థనారి శక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలందరికీ వైద్య పరీక్షలను అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వైద్యులు ప్రతాప్, స్నేహిత తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాతమంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. 150 మంది మహిళలకు పరీక్షలు చేశారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, నాందేవ్, డెమో వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచాలని వినతి

భీమారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం వెంటనే పెన్షన్లు పెంచాలని వికలాంగుల పోరాటసమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ సదానందంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అధ్యక్షుడు మెండె మల్లేశ్, నాయకులు లచ్చన్న, వేల్పుల సతీశ్, గాలిపల్లి సత్యనారాయణ, దివ్యాంగులు ఉన్నారు.

మెగా రక్తదాన శిబిరం



శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు

మంచిర్యాలఅర్బన్: ఈనెల 21న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు జన్మదినం పురస్కరించుకుని స్థానిక పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 180 మంది అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే తనయుడు కొక్కిరాల చరణ్, ఉమ్మడి డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్వీ రమణ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ నర్సయ్య, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్‌రావు, ఉదారి చంద్రమోహన్, మిమ్స్, శ్రీహర్ష, వాగ్దేవి, అల్ఫోర్స్ కళాశాల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసరాజు, మనోహర్‌రెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్, ట్రస్మా నాయకులు బాలాజీ, ఉస్మాన్, సాధిక్‌పాషా, దుర్గాప్రసాద్, శరత్‌కుమార్ పాల్గొన్నారు.